www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 3 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-140 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



సెప్టెంబర్ 17న

# తెలంగాణ జాతీయ సమైక్యతా దినం

## తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు





- 17న పబ్లిక్ గార్డెన్స్‌లో కెసిఆర్ జెండా ఆవిష్కరణ
- నెక్లెస్ రోడ్డు నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ
- పోడు భూముల సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ
- భద్రాచలం ముంపు బాధితుల కోసం ఇళ్ల నిర్మాణం

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** తెలంగాణ ఈ సెప్టెంబర్ 17 నాటికి 75 సంవత్సరాల్లోకి అడుగి డుతున్నది. ఈ నేపథ్యంలో 2022 సెప్టెంబర్ 17 ను 'తెలంగాణ జాతీయ సమైక్యతా దినం'గా పాటించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా సెప్టెంబర్ 16, 17, 18 తేదీల్లో మూడు రోజుల పాటు వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇందులో భాగంగా 17న పబ్లిక్ గార్డెన్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించ నున్నారు. అనంతరం నెక్లెస్ రోడ్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు భారీ ఊరేగింపు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించనున్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినంలో భాగంగా అన్ని జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించ నున్నారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు జెండాలను ఎగుర వేస్తారు. 18న అన్ని జిల్లా కేంద్రాల్లో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిం చనున్నారు. తెలంగాణ స్ఫూర్తిని చాటాలే సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిర్వహించనున్నారు. అలాగే ఈ నెల 17న బంజారా, ఆదివాసీ భవన్‌కు ప్రారంభోత్సవం చేయనున్నారు. ఇకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పోడు భూముల విషయంపై కేబినెట్ లో సుదీర్ఘంగా చర్చించారు. గిరిజనుల పోడు భూముల సమస్య పరిష్కారానికి రెవెన్యూ, ఫారెస్ట్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలతో పాటు జిల్లాల మంత్రుల ఆధ్వర్యంలో.. ప్రతి జిల్లాలో సమన్వయ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చర్యలు చేపట్టాలని కేబినెట్ సూచించింది. ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో 100 మందికి దళితబంధు పథకాన్ని అందిస్తున్నారు. 100 మంది లబ్దిదారులతో పాటు మరో 500 మందికి కూడా దళిత బంధు పథకాన్ని విస్తరించాలని నిర్ణయించారు. ఇదే విధానాన్ని హుజూరాబాద్ నియోజక వర్గంలో అమలు చేస్తున్న నేపథ్యంలో మిగిలిన 118 నియోజకవర్గాల్లోనూ అమలు చేయాలని నిర్ణయించారు. లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియను త్వరగా ముగించాలని అధికారులను కేబినెట్ ఆదేశించింది. జీహెచ్ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్లలో కో ఆప్షన్ మెంబర్ల సంఖ్యను పెంచాలని నిర్ణయం.

2వ

# మూడ్రోజుల పాటు తెలంగాణ వజ్రోత్సవాలు

- స్వాతంత్ర్య వజ్రోత్సవాల తరహాలో
- దేశంలో అంతర్భాగమైన రోజుగా పరిగణిస్తూ ఉత్సవాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించనుంది. స్వతంత్ర భారత వజ్రోత్సవాల తరహాలోనే దేశంలో హైదరాబాద్ రాష్ట్రం అంతర్భాగమైన సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ వజ్రోత్సవ వేడుకలను ఈ నెల 16,17,18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేబినెట్ సమావేశంలో సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ప్రగతిభవన్ లో మూడు గంటల పాటు కేబినెట్ భేటీ జరిగింది. సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలు, పాలనాపరమైన అంశాలు, తెలంగాణ విలీన వజ్రోత్సవాల నిర్వహణ, విద్యుత్ బకాయిలు, ఇతర అంశాల్లో కేంద్రం వైఖరి, పోడు భూములు, ప్రభుత్వ ఉద్యోగులకు డీఏపై కేబినెట్ లో చర్చించారు. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామిక వ్యవస్థలోకి జరిగిన తెలంగాణ సమాజ పరిణామక్రమం, 2022 సెప్టెంబర్17 నాటికి 75 సంవత్సరాల్లోకి అడుగిడుతున్నది. ఈ నేపథ్యంలో 2022 సెప్టెంబర్ 17 దినం' గా పాటించాలని కేబినెట్ నిర్ణయించింది. సెప్టెంబర్ 16, 17, 18 తేదీలల్లో మూడు రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా.. 'తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల' ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేబినెట్ సమావేశం నిర్ణయించింది. సీఎం కేసీఆర్ అధ్యక్షతన ప్రగతిభవన్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. అసెంబ్లీ సమావేశాలు, పాలనాపరమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అలాగే పలు చట్ట సవరణల బిల్లులపైనా మంత్రివర్గంలో చర్చలు జరిపారు. జీహెచ్ఎంసీ, పురపాలక చట్టాల సవరణలపై చర్చించారు. జీహెచ్ఎంసీ కో-ఆప్షన్ సభ్యుల సంఖ్య పెంపు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల చట్ట సవరణ గురించి మంత్రివర్గంలో చర్చ జరిపారు. మరో 5 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతుల మంజూరు అంశం సైతం ఈ భేటీలో చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అటవీ కళాశాల, పరిశోధనా సంస్థల్లో కొత్త కోర్సులు, పోస్టులపై చర్చ జరగనుంది. సీఎంకు వినతిపత్రం అందజేసిన సీపీఎం నేతలుఅంతకుముందు సీఎం కేసీఆర్‌తో రాష్ట్ర సీపీఎం నేతలు సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన 20 సమస్యలపై సీఎంకు వినతిపత్రాన్ని సమర్పించారు. పోడు భూములు, ధరణి సమస్యలు, కౌలు రైతులు, గిరిజన రిజర్వేషన్లు, ఏకకాలంలో రుణమాఫీ, వీఆర్ఏలకు పేస్కేలు, ఉద్యోగాలు భర్తీ, ఉద్యోగుల బదిలీ తదితర అంశాలపై విజ్ఞప్తులు అందజేశారు.

# మునుగోడు ఎప్పటికీ కాంగ్రెస్ కంచుకోట



- ఇక్కడ ఓడించే శక్తి మోడీకి..కేడీకి లేదు
- మునుగోడులో,టిఆర్ఎస్, బిజెపిలు గెలిచినా లాభం లేదు
- కాంగ్రెస్‌తో లాభం పొంది.. బిజెపి పంచన చేరిన రాజగోపాల్
- టీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలపై కాంగ్రెస్ చార్జ్‌షీట్
- గడపగడపకూ దీనిని తీసుకుని వెళ్లాలన్న కాంగ్రెస్ నేతలు
- కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్,ఉత్తమ్ జానా తదితరులు

**నల్గొండ, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** మునుగోడులో కాంగ్రెస్‌ను ఓడించే శక్తి కేంద్రంలోని మోడీకి లేదు.. రాష్ట్రంలోని కేడీకి లేదని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి చెందిందంటే దానికి కాంగ్రెస్ కారణమన్నారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ డెవలప్ అయితే..తెలంగాణ వచ్చాక కేసీఆర్ దందాలు చేసి అప్పుల పాలు చేశారని ఆరోపించారు. చెప్పుకోవడానికి చరిత్ర లేనోళ్లు... చేయడానికి చరిత్ర లేనోళ్లు..ఇవాళ మతంపేరు మీద, ప్రాంతం పేరు మీద వివాదాలు సృష్టించి పబ్బం గడుపు కోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. మునుగోడులో టీఆర్ఎస్ గెలిచినా ఓడినా పోయేదేమి లేదని చెప్పారు. దుబ్బాక, హుజూరాబాద్‌లో ఓడితే ఏమైందన్నారు. అటు దుబ్బాక, హుజూరాబాద్‌లో గెలిచిన బీజేపీ ఆ నియోజకవర్గ ప్రజలకు ఏం చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి 140 ఏండ్లకు పైగా చరిత్ర ఉందన్నారు. దేశ ప్రజలకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది కాంగ్రెస్ అని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి..ఇక్కడ ప్రజల గోసను

2వ

# ఏడాది పాటు తెలంగాణ విమోచన దినోత్సవాలు

- 17న పరేడ్ గ్రౌండ్‌లో విమోచనోత్సవ వేడుకుల
- ముఖ్యత అతిథిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా
- తెలంగాణ, కర్నాటక,మహా సిఎంలకు లేఖలు: కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మహారాష్ట్ర, కర్ణాటక , తెలంగాణ సీఎంలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆయా ప్రభుత్వాలకు లేఖ రాశారు. ఈ లిబరేషన్ డేను సెప్టెంబర్ 17, 2022 నుంచి సెప్టెంబర్ 17, 2023 అంటే ఏడాది పాటు నిర్వహించాలని నిర్ణయించిందని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో పాటు ఈ కార్యక్రమాన్ని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభిస్తున్నట్టు కిషన్ రెడ్డి తెలిపారు. అంతే కాకుండా ఈ ఈవెంట్ కు ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి విచ్చేస్తున్నట్టు స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం కేసీఆర్ గెస్ట్ ఆఫ్ హనర్‌గా హాజరు కావాలని కిషన్ రెడ్డి ఆహ్వానం పలికారు. తెలంగాణ సీఎంతో పాటు, మహారాష్ట్ర సీఎం ఎక్ నాథ్ షిండే, కర్ణాటక సీఎం బసవరాజు బొమ్మైలకు సైతం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖలు రాశారు. ప్రారంభ కార్యక్రమన్ని సికింద్రాబాద్ పేరెడ్ గ్రౌండ్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్లు కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి వస్తున్నట్లు తెలిపారు.

# తన ప్రశ్నలకు జవాబు ఇవ్వకుండా విమర్శలా

- రైతుల ఆత్మహత్యలపైనా జవాబు చెప్పండి
- నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా దాటవేస్తే ఎలా
- మూడోరోజు పర్యటనలో మరోమారు నిర్మల ధ్వజం



కామారెడ్డి,సెప్టెంబర్3(ఆర్ఎన్ఎ): శుక్రవారం జిల్లాలో తన పర్యటన సందర్భంగా తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే రాష్ట్ర మంత్రులు తనపై అకారణంగా మండిపడుతున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధ్వజమెత్తారు. జిల్లాలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన మూడో రోజు కొనసాగుతోంది. ఇందులో భాగంగా గాంధారిలో రైతులతో ఆమె సమావేశమయ్యారు. తెలంగాణ సర్కార్‌పై మరోసారి విమర్శలతో విరుచుకుపడ్డారు. తెలంగాణలో రైతులకు అన్యాయం జరుగుతోందని నిర్మల ఆరోపించారు. భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వడం లేదన్నారు. 2017 నుంచి 2019 మధ్య రాష్ట్రంలో రెండువేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు రికార్డ్స్ చెబుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో రుణమాఫీపై హామీ ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వం కేవలం వందలో ఐదుగురు రైతులకు మాత్రమే చేసినట్లు చెప్పారు. మల్లన్నసాగర్ ,మిడ్ మానేరు ,సీతారామ ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటిదాకా పూర్తి పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. వీటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న వేయొద్దని, వరి వేస్తే ఉరేనంటూ రైతులను తెలంగాణ ప్రభుత్వం బెదిరిస్తోందని నిర్మల ÷ర్ అయ్యారు. అందరివాడైన రైతు సమస్యలను కేసీఆర్ సర్కార్ రాజకీయాలకు వాడుకుంటోందని మండిపడ్డారు. సున్నితమైన అంశాన్ని రాజకీయలబ్ది కోసం ఉపయోగించు కోవాలని చూస్తున్నారని విమర్శించారు. 2014 నుంచి మోదీ ప్రభుత్వం ఆయా రాష్ట్రాల్లోని రైతు సమస్యలకు అనుగుణంగా రైతు సంక్షేమం గురించి ఆలోచిస్తోందని నిర్మల అన్నారు. ఏ రాష్ట్రానికి ఏం కావాలో ప్రధాని మోదీకి తెలుసని వ్యాఖ్యానించారు.

# బిజెపి నిర్ణయించిన తరవాతనే టీఆరెస్ స్పందన

- ఎంఐఎంకు భయపడి ఎనిమిదేళ్లుగా పక్కనపెట్టారు
- దారుస్ లాలం ఆదేశాలతోనే మిన్నకున్నారు
- మిడియా సమావేశంలో బండి సంజయ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** తెలంగాణలో సెప్టెంబర్ 17పై రాజకీయం నడుస్తోంది. మొదట బీజేపీ సెప్టెంబర్ 17న విమోచన దినం జరుపుతామని తెలిపింది. ఇందులో భాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలంగాణకు కూడా రానున్నారు. ఈ నేపథ్యంలో ఎంఐఎం, అధికార టీఆర్ఎస్ సెప్టెంబర్ 17 జాతీయ సమైక్యతా దినం జరపాలని సూచించాయి. నేపథ్యంలో తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్.. టీఆర్ఎస్, ఎంఐఎంపై ఫైరయ్యారు. బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న విమోచన దినం ఇన్ని రోజులు ఎందుకు జరుపలేదు. మేము ఎన్నో ఏళ్లుగా విమోచన దినోత్సవం కోసం పోరాడుతు న్నాము. కేంద్రం అధికారికంగా విమోచన దినం జరుపుతామన్నాకే అన్ని పార్టీలు స్పందిస్తున్నాయి. ఉద్యమ సమయంలో విమోచన దినం జరపాలని కేసీఆర్ ఎందుకు అన్నారు. ఇప్పుడెందుకు సమైక్యత రాగం ఎత్తుకున్నారని మండిపడ్డారు. ఒవైసీ కుటుంబం నుంచి వచ్చిన ఆదేశాలనే కేసీఆర్ పాటిస్తున్నారు. దారుస్సలాం ఆదేశాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ విమోచన దినోత్సవం జరిపాల్సిందే. అసద్దుదీన్ ఒవైసీ చేతిలో టీఆర్ఎస్, కాంగ్రెస్, వామపక్షాలు కీలుబొమ్మలు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఒక్కసారి కూడా జై తెలంగాణ అనలేదు. కేంద్రం అధికారికంగా విమోచన దినోత్సవం జరుపుతామన్నాకే ఇప్పుడు పార్టీలు స్పందిస్తున్నాయని అన్నారు. టీఆర్ఎస్, ఎంఐఎం చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. బీజేపీ పోరాటంతోనే సెప్టెంబర్ 17ను చేయడానికి అందరూ ముందుకొచ్చారన్నారు. విమోచన వేడుకలే వద్దన్న కేసీఆర్ మావల్లే దిగొచ్చాడని తెలిపిన బండి సంజయ్.. దారుస్సాలం నుంచి ఆదేశాలు రాగానే టీఆర్ఎస్ అమలు చేస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఎంఐఎం వ్యతిరేకించిందని.. టీఆర్ఎస్, ఎంఐఎం ఏం చెబితే కాంగ్రెస్ అదే పాటిస్తుందని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చింది కాదా ఇంకా విమోచన దినోత్సం ఎందుకన్న కేసీఆర్.. ఇప్పుడు మాట మార్చారన్నారు. అది నోరా తాటి మట్టనా అర్దం కాదని.. చరిత్రను మరిచి మాట్లాడుతున్నారని బండి సంజయ్ తెలిపారు.

# సిఎం కెసిఆర్‌తో సిపిఎం నేతల భేటీ

## మునుగోడు ఎన్నికపై చర్చ



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** సీపీఎం నేతలు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ అయ్యారు. సీఎం ఆహ్వానం మేరకు ప్రగతిభవన్‌లో కేసీఆర్‌తో సమావేశమయ్యారు. వీరి ఇరువురి భేటీతో ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు ప్రగతి భవన్‌కు వెళ్లారు. మునుగోడు ఉప ఎన్నికల్లో తెరాసకు సీపీఎం మద్దతు ప్రకటించిన తర్వాత తొలిసారి సీఎంతో సమావేశం కావడంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. మునుగోడు ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలతో పాటు తాజా రాజకీయాలపైన చర్చించారు. భాజపాకు వ్యతిరేకంగా కేసీఆర్ చేస్తున్న పోరాటాన్ని స్వాగతిస్తున్నామని చెప్పి, ఈ ఎన్నికలో తమ మద్దతు తెరాస పార్టీకే ఉంటుందని మునుగోడు సభకు ముందు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఈ ఒక్క ఎన్నికలో మాత్రమే తెరాస పార్టీకి మద్దతు ఇస్తామని సమావేశంలో తెలిపారు. దీంతో కేసీఆర్‌తో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఉపఎన్నికలో ఎలాగైనా సత్తా చాటాలని.. భాజపా, తెరాస పార్టీలు ఇప్పటికే పావులు కదుపుతున్నాయి. ఈ రెండు పార్టీలు పోటాపోటీగా ప్రచారాలు, సభలతో బలప్రదర్శన చేస్తుంటే.. కాంగ్రెస్? మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది.

## సంపాదకీయం


### రాజకీయ ప్రయోజనాలే బిజెపి ఎజెండా !

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాగా వేయడమెలా..ఇప్పుడున్న పార్టీలను అణగగదొక్కడమెలా అన్నదే ఇప్పుడు బిజెపి ఎజెండాగా మారింది. సమస్యలను పరిష్కనించడం అన్నది దాని అజెండాలో లేదు. ఈ రెండు రాష్ట్రాలు కలిసి పోరాడకుండా కూడా అది జాగ్రత్త పడుతోంది. అలాగే అవసరమైతే పోపు వేయడా నికి వెనకాడడం లేదు. ఈ క్రమంలో బిజెపి ఎత్తులను పసిగడుతూ ఉమ్మడిగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని రెండు తెలుగు రాష్ట్రాల నేతలు గుర్తించాలి. ఎపికి ప్రత్యేకహోదా తెలంగాణ విభజన సమస్యలు తీర్చే ఆలోచనలో కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం సిద్దంగా లేదు. గత ఎనిమిదేళ్లుగా ఈ విషయంలో కేంద్రం దగా చేస్తూనే ఉంది. పైగా దబాయింపులకు పాల్పడుతోంది. ఎవరు ఎంతగా పోరాడినా పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తినా బిజెపి నేతల ప్రకటనలు చూస్తుంటే తెలుగు రాష్ట్రాల సమస్యలను పరిష్కరించక పోగా పైపచ్చు చిచ్చు పెట్టే యత్నాల్లో ఉంది. తాజా ఘటనలు చూస్తుంటే ఇదే అర్థం అవుతోంది. ఈ విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బిజెపి తన ఆపరేషన్‌ను మొదల పెట్టి ఇప్పుడున్న ప్రభుత్వాలకు ఎసరు పెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. అలాగే తెలంగాణ లో కూడా అదే తరహాలో రాజకీయాలు నడపాలని చూస్తోంది. అయితే పెద్దగా పట్టు లేదా బలం లేని ఈ రెండు రాష్ట్రాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా పార్టీని బలోపేతం ఎలా చేస్తారన్నది బిజెపికే తెలియాలి. ఇక మరోవైపు ప్రజలు లేదా నేతలు ఎలాంటి పోరాటాటు చేసినా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా మాత్రం రావడం అన్నది కల్ల. మరో ఏడాదిన్నరలో ఎన్నికలు ఉన్నందున దీనిపైనే మోడీ ప్రభుత్వం కసరత్తులు ఉంటాయి. ప్రత్యేక హోదా సంగతి పక్కన పెడితే ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజీని కూడా బిజెపి అటకెక్కించింది. లెఫ్ట్,కాంగ్రెస్ తదితర ప్రధాన రాజకీయ పార్టీలు రోడ్డెక్కినా లాభం లేదనిపిస్తోంది. ఇందులో కూడా అధికార, ప్రతిపక్షాలైన తెలుగుదేశం, వైసీపీ వ్యూహ ప్రతివ్యూహాలు కేవలం రాజకీయ లబ్దికి అనుగుణంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ఎన్నికలకు ఏడాదిన్నర ముందే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితులు వేడెక్కాయి. ఎన్‌డీఏ నుంచి తెలుగుదేశం పార్టీని బయటకు వచ్చేలా చేసిన బిజెపి ఇప్పుడు మళ్లీ ఆకర్శించే ప్రయత్నాల్లో ఉంది. ప్రజాక్షేత్రంలో బలం లేని కమ్యూనిస్టు పార్టీలతో పాటు కొంతమంది వ్యక్తులు కలిసి ప్రత్యేక హోదా అంటూ నినదించడం, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపీ దాన్ని అందిపుచ్చుకోవడం వల్ల వచ్చే లాభం లేదు. కమ్యూనిస్టులైన సీపీఎం, సీపీఐ సొంతంగా ఒక్క సీటు కూడా గెలవలేని పరిస్థితి. రాజకీయ విధానం విషయం వచ్చేసరికి ఈ రెండు పార్టీలదీ చెరో దారి! కమ్యూనిస్టులకు తోడుగా ఇప్పుడు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కొత్తగా తెరపైకి వచ్చారు. వీరిని కలుపుకుని పోరాడుతామని అనుకుంటున్నా స్పష్టత లేదు. ప్రజాబలం లేని కమ్యూనిస్టులు, గమ్యం ఎటో తెలియని పవన్ కల్యాణ్ వల్ల ఒరిగేదేమీ లేదు. వీరి ప్రయత్నాలు ఓ రకంగా బిజెపికి లాభం చేసకూర్చేవిగా ఉన్నాయి. పోరాటాన్ని సమష్టిగా ముందుకు తీసుకువెళ్దామని ప్రకటించిన పవన్ కళ్యాణ్ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నా అధికార వైసిపిని కదిలించే శక్తిగా మారడంలేదు. మొత్తంగా అటు ఎపిలో వైకాపా, టిడిపి, జనసేన, బిజెపి, లెఫ్ట్ పార్టీలు చేస్తున్నవన్నీ కూడా రాజకీయ స్వలాభం కోసమే అన్నది సుస్పష్టం. ఇకపోతే తెలంగాణలో కాంగ్రెస్ యాత్రలు చేస్తోంది. బిజెపి అవినీతిని పట్టుకుని విమర్శలకు దిగుతోంది. మొత్తంగా రాజకీయాలు ఎప్పుడు మొదలైనా ఎన్నికల సమయంలో వాటిని వేడిక్కెక్కించే దిశగా సాగుతున్నాయి. ఎన్నికల సమయం కావడంతో ప్రజలు కూడా కొచెం ఆసక్తి కనబరుస్తున్నారు. ఎపిలో ఎన్నికలకు రెండేళ్ల ముందు ఇప్పుడు మరోమారు విభజన హామీలపై చర్చ సాగుతోంది. చర్చతో పాటు రచ్చ కూడా మొదలయ్యింది. పార్లమెంట్ వేదికగా ఎంపిలు గళమెత్తడం, కేంద్రం పెద్దగా పట్టించుకోకపోవడం చూశాం. ఆ తరవాత వామపక్షాలు కూడా తమ బలాన్ని చాటుకునేం దుకు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎవరికివారే యమునాతీరే అన్న చందంగా ఆందోళనలు సాగాయే తప్ప ఎపి కోసం ఉమ్మడిగా కార్యాచరణ సాగలేదు. విభజన తరవాత కేంద్ర సాయం విషయంలో తెలంగాణ కూడా దగా పడింది. అనేక విషయాల్లో కనీసంగా కూడా కేంద్రం నుంచి సాయం అందడం లేదు. తెలంగాణ తరహాలో అన్ని రాజకీయ పార్టీలో కలసి ఉద్యమిస్తే తప్ప ఎపికి సంబంధించి విభజన హామీలను నెరవేర్చుకోలేమని అంటున్న వారు దానిని ఆచరించే ధోరణిలో లేరు. రాజకీయంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పుడు కొత్త పాత్ర పోషించబోతున్నారన్న సూచనలు ఇచ్చారు. వైకాపా ను దించేందుకు ఓట్లు చీలిపోకుండా చూడాలని అంటున్నారు. ప్రత్యేక హోదా విషయంలో అధికార వైసిపి ఎన్ని పిల్లిమొగ్గలు వేయాలో అన్నీవేసింది. అయితే ఎప్పటికప్పుడు కేంద్రం మోసం చేసిందే తప్ప.. హోదా లేదు..ప్యాకేజీ లేదు.. అన్నది జనాలకు కూడా తెలిసిపోయింది. ఏపీకి జరిగిన అన్యాయం విషయంలో పోరాటం పేరిట రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు మళ్లీ మొదలయ్యాయి. రాష్ట్రంలో భూస్థాపితమైన పార్టీని బతికించుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా, జరిగిన అనర్థానికి తెలుగుదేశం వైఫల్యమే కారణమని చెప్పడానికి వైసీపీ ప్రయత్నాలు మొదలెట్టింది. ప్రస్తుత పరిస్థితులలో రాజకీయంగా నష్టం జరగకుండా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే ప్రయత్నాలను ముమ్మరం చేయాల్సి ఉంది. తెలంగాణ, ఎపిలు ఉమ్మడిగా సమస్యలపై పోరాడకుంటే బిజెపి ఈ రెండు రాష్ట్రాలను ఆగం చేయడం ఖాయం. బిజెపికి అధికారంమీద ఉన్న యావ సమస్యల పరిష్కారంలో లేదు. బిజెపిది ధృతరాష్ట్ర కౌగిలి అన్నది అందరికీ తెలిసిందే. ఈ విషయాల్లో అప్రమత్తంగా ఉండకుంటే అణగదొక్కి పైకెక్కడంలో బిజెపి వెనకడుగు వేయదు.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ఎంగిలి మెతుకుల కోసం రాజగోపాల్ రెడ్డి పార్టీ మారిండు

- కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి నమ్మకద్రోహం చేసిండు
- మునుగోడు ప్రజలు తప్పక బుద్ధి చెపుతారు
- విలేకరుల సమావేశంలో సత్యనారాయణ రావు



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** కేవలం బిజెపి పార్టీ వేసే ఎంగిలి మెతుకుల కోసమే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ మారిండని, మునుగోడు లో నూటికి నూరు పాళ్ళు ఎగిరేది కాంగ్రెస్ జెండాయేనని, వేల కోట్ల కాంట్రాక్టుల కొరకే పార్టీ మారడని అందుకు రాజగోపాల్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి, మునుగోడు ఉపఎన్నిక సంస్థాన్ నారాయణపురం మండల ఇంచార్జీ గంద్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. శనివారం సంస్థాన్ నారాయణపురం మండలంలో విలేకరుల సమావేశంలో నిర్వహించిన విలేకరుల సమావేశానికి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరామ్ నాయక్‌తో కలిసి గంద్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. మునుగోడు ప్రజలు ఎంతో చైతన్యవంతులని, బీజేపీ పార్టీ, టీఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మునుగోడు నియోజకవర్గ ప్రజలకు రాజగోపాల్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఎన్నో పదవులు అనుభవించి, ఇలా బయటకు వెళ్ళడం అంటే, కన్నతల్లి పాలు తాగి ఆ తల్లి రొమ్ము గుద్దినట్లే అని అన్నారు. ఇక కోమటిరెడ్డి ఓటమి ఖాయమని, ఇక ఆయన అసెంబ్లీలో అడుగు పెట్టటం అనేది జరుగదు అంటూ వ్యాఖ్యానించారు. కొంత మంది నాయకులు స్వార్థంతో పార్టీ మారినంత మాత్రాన పార్టీకి నష్టమేమీ లేదన్నారు. నిన్నటి నుండి కొనసాగుతున్న మన కాంగ్రెస్ – మన మునుగోడు కార్యక్రమం ఇప్పటి వరకు గుడిమల్కాపురం, చిమిర్యాల, మహ్మదాబాద్, కంకణాల గూడెం, శేరిగూడెం, సర్వేల్, ఆరెగూడెం, వాయిల్ల పల్లి గ్రామాల్లో పూర్తయినట్లు తెలిపారు. మిగతా గ్రామాల్లో కూడా నేడు, రేపు మన కాంగ్రెస్ – మన మునుగోడు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి దోడ శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం మురళీధర్ రెడ్డి, యం.డి అక్బర్, మాడుగుల బాల కృష్ణ, రాచకొండ రమేష్, ఏపూరి సతీష్, బడేసాబ్, రాసమల్ల యాదయ్య, రమేష్, వంగూరి సత్తయ్య, గోపాల్, సంజీవ, వెంకటేష్, ఘనం అంజయ్య, గోపాల్, పిట్ట కృష్ణ, వీరమల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు ఎప్పటికీ కాంగ్రెస్ కంచుకోట



(మొదటి పేజీ తరువాయి..)తీర్చింది కాంగ్రెస్ అని చెప్పారు. మూడు తరాలు దేశం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీ కుటుంబ వారసులం అని..మునుగోడులో కార్యకర్తలు కలిసికట్టుగా పోరాడి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా టీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలపై కాంగ్రెస్ చార్జ్‌షీట్ విడుదల చేసింది. కేసీఆర్, మోడీ మీద కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలున్నాయని..వాటిని కేసీఆర్ పట్టించుకోవడం లేదని రేవంత్ మండిపడ్డారు. పోడు భూములు, రైతుల ఇబ్బందులను గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఒక రకమైన పరిహారం, మునుగోడు నియోజకవర్గ నిర్వాసితులకు మరో రకమైన పరిహారం ఇచ్చారని విమర్శించారు. సమస్యలను పరిష్కరించకుండా బీజేపీ, టీఆర్ఎస్‌లు మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. తోడేళ్ల మంద, మిడతల దండు లెక్క మునుగోడు నియోజకవర్గం మీద బీజేపీ, టీఆర్ఎస్‌లు పడుతున్నాయని..రెండు పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇకపోతే ఆగస్టు 15కు ఎంత ప్రాముఖ్యత ఉందో..తెలంగాణాలో సెప్టెంబర్ 17కు కూడా అంతే ప్రాముఖ్యత ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యమ సమయంలో సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించలేదని విమర్శించిన కేసీఆర్..తెలంగాణ వచ్చాక..8 ఏండ్లలో సెప్టెంబర్ 17ను అధికారికంగా ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ఆంధ్రా వాళ్ల కమిషన్లకు కక్కుర్తి పడి కేసీఆర్ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదని ఆరోపించారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని.. కేసిఆర్ క్యాబినెట్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఇన్నేండ్లు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరపని కేసీఆర్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అటు కాంగ్రెస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుండి ఏడాది పాటు వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కోమటిరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ ఎన్నో పదవులు ఇచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. 2009లో రాజగోపాల్ రెడ్డికి ఎంపీ టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిందని.. ఓడిపోతే ఎమ్మెల్సీగా గెలిపించిందన్నారు. ఎమ్మెల్సీగా ఉండగానే..ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందన్నారు. కానీ ప్రజలు వేసిన 97 వేల ఓట్లను మోడీకి 22 వేల కోట్లకు రాజగోపాల్ రెడ్డి అమ్ముకున్నాడని ఆరోపించారు. రాజీనామా చేస్తే నిధులు వస్తాయని రాజగోపాల్ రెడ్డి అన్నారని..రాజీనామా తర్వాత మునుగోడు నియోజకవర్గంలో ఎన్నిగ్రామాల్లో రోడ్లేశారని ప్రశ్నించారు. రైతుల రుణమాఫీ అయిందా అని అడిగారు. రాజీనామాతో రాజగోపాల్ రెడ్డి మాత్రమే లాభపడ్డారని మండిపడ్డారు. మునుగోడు నియోజకవర్గంలో నేతల కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. మునుగోడులో నేతల అమ్మకాలు తప్ప అభివృద్ధి శూన్యమని చెప్పారు. పార్టీ మారిన నేతలను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవాలని సూచించారు. 2018లో కాంగ్రెస్‌కు 97వేల ఓట్లు వచ్చాయని రేవంత్ రెడ్డి చెప్పారు. మన ఓట్లు మనకే పడేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రతీరోజూ రెండు గంటలు కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాలు, బస్తీల్లో తిరగాలని కోరారు. సమస్యలపై ప్రజలకు వివరించాలని..కాంగ్రెస్ వస్తే లాభమేందో చెప్పాలన్నారు. ప్రజల సమస్యలపై కొట్లాడాలని..చిత్తశుద్ధితో పనిచేస్తే నూటికి నూరు శాతం కాంగ్రెస్ 40 వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తుం దని ధీమా వ్యక్తం చేశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టు కార్యకర్తలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. నాయకులు ఎటు పోయినా..ఈ ప్రాంత చరిత్ర తెలిసిన కమ్యూనిస్టు కార్యకర్తలు ఆలోచించాలన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ తో పాటు ప్రజలను మోసం చేయడం వల్లే ఉప ఎన్నిక వచ్చిందని ఆ పార్టీ సీనియర్ నేత, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మునుగోడులో జరిగిన కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశంలో బీజేపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలపై ఛార్జ్ షీట్?ను పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు విడుదల చేశారు. మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ కు కంచుకోట అన్న ఉత్తమ్ కుమార్.. బీజేపీలో చేరితే మునుగోడు ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పా లని డిమాండ్ చేశారు. 8 ఏండ్లలో జరగని అభివృద్ధి ఇప్పుడెట్లా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కేంద్రం లో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో టీఆర్ఎస్ సర్కారు ప్రజల కోసం చేసిందేమీ లేదని ఉత్తమ్ ఆరోపించారు. టీఆర్ఎస్, బీజేపీ మోసాలపై విడుదల చేసిన ఛార్జ్ షీట్ ప్రతి ఇంటికీ చేరాలని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు, భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వకపోవడం, డిగ్రీ కాలేజీల ఏర్పాటు హామీ, పోడు భూముల సమస్యపై నిర్లక్ష్యం, డబుల్ బెడ్రూం ఇండ్ల హామీ, ఫ్లోరైడ్ సమస్య తదితర అంశాలపై ప్రజలను టీఆర్ఎస్ ఎలా మోసం చేసిందో ప్రజలకు వివరించాలని ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఎనిమిదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. మునుగోడు గడ్డపై మరోసారి కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, టీఆర్ఎస్ పాలనపై విడుదల చేసిన ఛార్జ్ షీట్‌ను కాంగ్రెస్ సైన్యం మునుగోడు నియోజకవర్గంలో గడపగడపకూ తీసుకెళ్లాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ కు కంచుకోట అన్న ఉత్తమ్ కుమార్.. బీజేపీలో చేరితే మునుగోడు ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. 8 ఏండ్లలో జరగని అభివృద్ధి ఇప్పుడెట్లా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో టీఆర్ఎస్ సర్కారు ప్రజల కోసం చేసిందేమీ లేదని ఉత్తమ్ ఆరోపించారు. టీఆర్ఎస్, బీజేపీ మోసాలపై విడుదల చేసిన ఛార్జ్ షీట్ ప్రతి ఇంటికీ చేరాలని అన్నారు.

# సెప్టెంబర్ 17న తెలంగాణ జాతీయ సమైక్యతా దినం

(మొదటి పేజీ తరువాయి..)జీహెచ్‌ఎంసీలో 5 నుండి 15 వరకు, ఇతర కార్పొరేషన్లలో 5 నుండి 10 వరకు కో ఆప్షన్ సభ్యుల సంఖ్యను పెంచాలని తీర్మానం చేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఫారెస్ట్ యూనివర్సిటీకి కొత్త పోస్టులను మంజూరు చేయాలని తీర్మానం. సుంకిశాల నుంచి హైదరాబాద్ నగరానికి నీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగు పరచాలని నిర్ణయం. అదనంగా 33 టీఎంసీల నీటిని శుద్ధి చేసి నగర ప్రజలకు సరఫరా చేయాలని నిర్ణయం. ఇందుకోసం రూ.2214.79 కోట్లను మంజూరు చేస్తూ కేబినెట్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కోర్టు భవనాల నిర్మాణాల కోసం 21జిల్లా కేంద్రాల్లో స్థలాల కేటాయింపు జరపాలని తీర్మానించారు. భద్రాచలంలో ముంపు ప్రాంతాల్లోని 2016 కుటుంబాలకు నూతనంగా కాలనీలను నిర్మించి ఇవ్వాలని నిర్ణయించారు.

## మునుగోడులో విజయం టిఆర్ఎస్‌దే

- సర్వేలన్నీ మనకే అనుకూలంగా ఉన్నాయి
- ఎమ్మెల్యేలతో కమిటీలు వేస్తాం
- సిబిఐతో ఇబ్బందులు పెట్టే పనిలో కేంద్రం
- టిఆర్ఎస్ఎల్‌పిల భేటీలో కెసిఆర్ వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** మునుగోడులో ఎప్పుడు ఎన్నిక జరిగినా గెలుపు టిఆర్ఎస్‌దే అని సిఎం కెసిఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో టిఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో సిఎం మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సర్వేలన్నీ మనకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేలతో కమిటీలు వేస్తామన్నారు. ఇదిలావుంటే టీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈడీ, సీబీఐ కి భయపడాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు అనవసరంగా ఇష్యూ చేస్తున్నాయని దుయ్యబట్టారు. 'సీబీఐతో మనల్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. మీ దగ్గరకు కూడా వచ్చే ప్రమాదం ఉంది. మహారాష్ట్ర లో శివసేన మాదిరిగా ఇక్కడా చేయాలని చూస్తారు. ఈడీ, సీబీఐ బెదిరింపులకు ఎవరూ భయపడొద్దు. సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలు మనపై పడతాయి. వాళ్లకు అవకాశం ఇచ్చే పనులు చేయవద్దు. అన్నిటికీ సిద్ధంగా ఉండాలి అని అన్నారు.

# కలెక్టర్ జితేశ్ పాటిల్‌కు మంత్రి కేటీఆర్ అండ

- కష్టపడే అధికారులకు బిజెపి నేతల బెదింరింపులు
- ట్విట్టర్ వేదికగా నిర్మలా సీతారామన్‌పై ధ్వజం

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** కామారెడ్డి కలెక్టర్ జితేశ్ పాటిల్‌కు మంత్రి కేటీఆర్ అండగా నిలిచారు. కలెక్టర్‌తో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవర్తించిన తీరు తనను భయపెట్టిందని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసే అధికారులను ఇలాంటి రాజకీయ నేతలు నిరుత్సాహపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా నాయకుల ప్రవర్తనతో ఐఏఎస్ అధికారులు భయపడుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో కలెక్టర్ గౌరవప్రదమైన ప్రవర్తనకు కేటీఆర్ అభినందనలు తెలియజేశారు. కష్టపడి పనిచేసే ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులను ఇలాంటి రాజకీయ నేతలు నిరుత్సాహపరుస్తున్నారని మండిపడ్డారు. దీనిపై కేటీఆర్ ట్విటర్ వేదికగా స్పందిస్తూ కేంద్రమంత్రిపై విమర్శలు గుప్పించారు. పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో పర్యటించారు. ఈ క్రమంలనే బీర్కూర్‌లో రేషన్ దుకాణాన్ని సందర్శించారు. ప్రజలకు ఇస్తున్న రేషన్ వివరాలను కలెక్టర్ జితేష్ పాటిల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద ఎంత బియ్యం పంపిణీ చేశారని ప్రశ్నించారు. పేదలకిచ్చే బియ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత ఖర్చు చేస్తున్నాయో చెప్పాలని లబ్దిదారుల ముందే నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర వాటాలు ఎంతో చెప్పాలంటూ లబ్దిదారుల ముందు కలెక్టర్‌ను నిలదీశారు. పాలనాధికారి సమాధానం చెప్పక పోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.రేషన్ బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.30 రూపాయలు ఇస్తుంటే.. రాష్ట్రం కేవలం రూ.5 ఖర్చు చేస్తుందని నిర్మల అన్నారు. ప్రజలకు అసలు విషయం చెప్పాలనే పర్యటిస్తున్నట్లు వెల్లడించారు. రేషన్ దుకాణం వద్ద పెట్టిన ఫ్లెక్సీలో ప్రధాని ఫొటో లేకపోవడంపై కలెక్టర్‌ను ప్రశ్నించారు. మోదీ ఫొటో ఎందుకు పెట్టలేదని నిలదీశారు. మరోసారి వచ్చేసరికి ప్రధాని ఫొటో ఉండాలని నిర్మలా సీతారామన్ ఆదేశించారు.

# తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై ఫోకస్

- పోలవరం తదితర అంశాలను ప్రస్తావించిన ఎపి మంత్రులు
- ఉభయులు కలసి పరిష్కరించుకోవాలన్న అమిత్ షా
- దక్షిణాదిలోనూ బిజెపికి ఆదరణ పెరుగుతుందన్న అమిత్ షా




**తిరువనంతపురం, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** విభజన సమస్యలు ఉభయ తెలుగు రాష్ట్రాలు సంయుక్తంగా పరిష్కరించుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచించారు. దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ కేరళ రాజధాని తిరువనంతపురంలో శనివారం సమావేశమైంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో వివిధ రాష్ట్రాల మధ్య వివాదాస్పదంగా ఉన్న వివిధ అంశాలపై చర్చించారు. సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ నుంచి హోంమంత్రి మహ్మూద్ అలీ హాజరయ్యారు. అలాగే తమిళనాడు సిఎం స్టాలిన్, కర్నాటక సిఎం బొమ్మై, కేరళ సిఎం పినరయ్ విజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విభజన సమస్యలను మంత్రులు ప్రస్తావించారు. అలాగే తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని కోరారు. రెవెన్యూ లోటు గ్రాంట్, 7 జిల్లాల ప్యాకేజీ నిధులు, రామాయపట్నం పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు గురించి సైతం ప్రస్తావించారు. మరోవైపు ఈ సమావేశానికి తెలంగాణ తరపున హోంమంత్రి మహమూద్ అలీ, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీరు ఏపీ, తెలంగాణ మధ్య విద్యుత్ బకాయిలు, విభజన సమస్యలు, కృష్ణా జలాల పంపిణీ, నీటిపారుదలకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ భారతదేశం నుంచి కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోందన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తు బీజేపీ పార్టీనేనని పేర్కొన్నారు. అలాగే.. ప్రపంచం నుంచే కమ్యూనిస్ట్ పార్టీలు కనుమరుగవుతున్నట్లు చెప్పారు. 'భారత్ నుంచి కాంగ్రెస్ అంతరించిపోతోంది. అలాగే కమ్యూనిస్ట్ పార్టీ సైతం ప్రపంచం నుంచే కనుమరుగవుతోంది. కేరళలో ఒక్క బీజేపీ పార్టీకే భవిష్యత్తు.' అని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. వెనకబడిన తరగతులు, మైనారిటీల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీలు ఎప్పుడూ పని చేయలేదని విమర్శించారు. వారిని కేవలం ఓటు బ్యాంకులాగే చూశారని దుయ్యబట్టారు. దేశం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలను కాంగ్రెస్ విస్మరించిందన్నారు. అందుకే వారి పాలనలో భారతరత్న ఇవ్వలేదని ఆరోపించారు.

# నితీశ్ కుమార్‌కు బిజెపి షాక్

- మణిపూర్‌లో ఐదుగురు ఎమ్మెల్యేలు బిజెపిలో చేరిక
- ఆరుగురిలో ఐదుగురి చేరికతో విలీనం ప్రకటన
- ధృవీకరించిన మణిపూర్ అసెంబ్లీ స్పీకర్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 (సమ సమాజం):** బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ నేత నితీశ్ కుమార్‌కు భారీ షాక్ తగిలింది. మణిపూర్‌లో జేడీయూకు చెందిన మెజారిటీ ఎమ్మెల్యేలు.. భాజపాలో చేరారు. దీంతో జేడీయూ శాసనపక్షం భాజపాలో విలీనమైంది. నితీశ్‌కు చెందిన జేడీయూ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు భాజపాలో చేరారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో జేడీయూకు ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. అందులో ఐదుగురు భాజపా తీర్థం పుచ్చుకున్నారు. మూడింట రెండింట మంది ఎమ్మెల్యేలు భాజపాలో చేరిన నేపథ్యంలో.. జేడీయూ శాసనపక్షాన్ని.. భాజపాలో విలీనం చేస్తున్నట్లు ఆ రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి కె. మేఘజిత్ సింగ్ ప్రకటించారు. వీరికి పార్టీ ఫిరాయింపులు చట్టం వర్తించదని అన్నారు. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. తమ పార్టీ శాసనసభ్యులను భాజపాలో చేర్చుకోవడం రాజ్యాంగ విరుద్ధమని జేడీయూ ఆరోపించింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ 38 స్థానాల్లో పోటీ చేసి.. ఆరు స్థానాల్లో విజయం సాధించింది. గెలిచిన వారిలో ఒక ఎమ్మెల్యే తప్ప మిగతావారందరూ భాజపాలో చేరారు. పార్టీ ఫిరాయించిన జేడీయూ ఎమ్మెల్యేల్లో కెహెచ్ జోయ్‌కిషన్, ఎన్ సనాతే, మహ్మద్ అచ్చుబుద్దీన్, ఏఎం ఖౌటే, తంగ్జామ్ అరుణ్ కుమార్ ఉన్నారు.ఏఎం ఖౌటే, అరుణ్ కుమార్ గత అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నుంచి టికెట్ ఆశించారు. అయితే భాజపా వారికి టికెట్ ఇవ్వకపోవడం వల్ల జేడీయూ నుంచి ఎన్నికల బరిలో దిగి గెలుపొందారు. కొన్ని రోజుల క్రితం అరుణాచల్ ప్రదేశ్‌లో జేడీయూకు ఉన్న ఏకైక శాసనసభ్యుడు భాజపాలో చేరారు. ఇటీవల బిహార్‌లో భాజపాతో తెగదెంపులు చేసుకుని ఆర్జేడీ కూటమితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు నితీశ్ కుమార్. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలు జరగడం గమనార్హం. మణిపూర్ లో ఐదుగురు జేడీ యూ ఎమ్మెల్యేలు బీజేపీలో విలీనమయ్యారని అసెంబ్లీ స్పీకర్ కూడా ప్రకటించారు. మైత్రీబంధం తెగిన తర్వాత బీజేపీ బీహార్ సీఎం నితీష్ కుమార్ కు రెండోసారి షాక్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ లో జేడీయూ ఎమ్మెల్యే టేకి కసో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో బీజేపీలో చేరారు.పార్టీ ఫిరాయింపులను బీజేపీ ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో 2024 ఎన్నికల్లో కమలం పార్టీని ఓడిస్తామని జేడీయూ అధికార ప్రతినిధి నీరజ్ కుమార్ చెప్పారు.




# చలన చిత్రం



## వరుస సినిమాలతో బిజీగా చిరు

చిరంజీవి ప్రస్తుతం వరుసగా సినిమాలను చేస్తూ యువహీరోలకు పోటీనిస్తున్నాడు. అప్పట్లో చిరంజీవికి ఎంత బిజీ షెడ్యూల్ ఉందో, ఇప్పుడు కూడా అంతే ఉంది. ప్రస్తుతం ఈయన చేతిలో నాలుగు సినిమాలు ఉన్నాయి. ప్రస్తుతం చిరు రెండు సినిమా షూటింగ్‌లను ఏకకాలంలో జరుపుతున్నాడు. అందులో బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న వాల్తేరు వీరయ్య ఒకటి. యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. కాగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా హైదరాబాద్‌లో ఈ సినిమాకు సంబంధించిన భారీ షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ ఎపిసోడ్‌లో కీలక ఘట్టాలను తెరకెక్కించనున్నారట. ఈ షెడ్యూల్‌లో రవితేజ కూడా పాల్గొననున్నాడట. కాగా ఇటీవలే దర్శకుడు బాబీ తండ్రి మరణించిన విషయం తెలిసిందే. అయితే షూటింగ్ తన వల్ల ఆగిపోవద్దనే ఉద్దేశంతో బాబీ కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించడం గొప్ప విషయం అనే చెప్పాలి. ఈ చిత్రం 'ముఠా మేస్త్రీ' తరహా మాస్ యాంగిల్‌లో ఉండనున్నట్లు పోస్టర్లను చూస్తే తెలుస్తుంది. చిరు ఈ సినిమాలో అండర్‌కవర్ కాప్‌గా కనిపించనున్నాడు. విశాఖపట్నం నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తుంది. మాస్‌రాజ రవితేజ కీలకపాత్రలో నటిస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం మెగాస్టార్‌కు 154వ సినిమాగా తెరకెక్కుతుంది.




## కృష్ణమ్మ చిత్రంలో పాట విడుదల

టాలీవుడ్ హీరో సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కృష్ణమ్మ'. కృష్ణ కొమ్మాలపాటి నిర్మాణంలో గోపాలకృష్ణ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. సత్యదేవ్ సరసన అథిర రాజీ హీరోయిన్ గా నటించింది. కొరటాల శివ సమర్పిస్తున్న ఈ సినిమాకి కాలభైరవ సంగీతాన్ని సమకూర్చాడు. తాజాగా ఈ సినిమా నుంచి టైటిల్ సాంగును రిలీజ్ చేశారు మేకర్స్. 'కృష్ణమ్మా కృష్ణమ్మా నీలాగే పొంగిందమ్మా మాలో సంతోషం. ఈ కొమ్మా ఆ రెమ్మా చల్లాయి గంధాలేవో మాపై ఈ నిమిషం' అంటూ ఈ పాట సాగుతోంది. అనంత శ్రీరామ్ సాహిత్యాన్ని అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడాడు. హీరోతో పాటు ముడిపడిన కొన్ని ముఖ్యమైన పాత్రలను, అతని ప్రయాణానికి సంధించిన సన్నివేశాలను ఈ వీడియోలో చూడొచ్చు. ఈ టైటిల్ సింగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కృష్ణమ్మా కృష్ణమ్మా నీలాగే పొంగిందమ్మా నాలో సంతోషం..' అంటూ ఈ పాటలో మిత్రుల మధ్య స్నేహాన్ని ఎంతో అందంగా హృదయానికి హత్తుకునేలా చెప్పారు. కాల భైరవ దీనికి బ్యూటీఫుల్ ట్యూన్ కంపోజ్ చేశారు. సింగర్ అనురాగ్ కులకర్ణి ఈ పాటను చాలా అందంగా ఆలపించారు. అతని స్వరం మంత్రముగ్ధులను చేస్తుంది. గీత రచయిత అనంత శ్రీరామ్ ట్యూన్ కు తగ్గట్టుగా అర్థవంతమైన హృదయపూర్వకమైన సాహిత్యం అందించారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ అందించగా.. తమ్మిరాజు ఎడిటింగ్ వర్క్ చేశారు. ఇందులో సత్య దేవ్ మరియు స్నేహితులతో అతని బంధాన్ని చూపించారు. ప్రధాన నటులు కలిసి కొన్ని అందమైన క్షణాలను పంచుకున్నట్లు ఈ లిరికల్ వీడియో చూపిస్తుంది. హీరోయిన్ అధిరా రాజ్ తో పాటుగా యువ నటుడు కృష్ణ తమ స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకర్షించారు.ఓవరాల్ గా కృష్ణమ్మ టైటిల్ సాంగ్ ఒక మ్యాజికల్ నంబర్ గా ఇంస్టెంట్ చార్ట్ బస్టర్ గా నిలిచే సాంగ్ అని చెప్పాలి. 'కృష్ణమ్మ' చిత్రంతో సత్యదేవ్ మొదటి సారిగా అవుట్ అండ్ అవుట్ మాస్ యాక్షన్ రోల్ లో కనిపించనున్నాడు. లక్ష్మణ్ - కృష్ణ - అర్చన - నందగోపాల్ - రఘు కుంచె - తారక్ - సత్యం ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



## ఎట్టకేలకు 23న రిలీజ్ కానున్న కృష్ణవింద విహారి

విభిన్న కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న నటుడు నాగశౌర్య... కెరీర్ ఆరంభం నుండి కథల ఎంపికలో వేరియేషన్ చూపిస్తూ టాలీవుడ్‌లో మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. వరుడు కావలెను, లక్ష్య వంటి బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్‌ల తర్వాత కృష్ణ వ్రింద విహారితో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. అనీష్ కృష్ణ దర్వకత్వం వహించిన ఈ చిత్రం పలు సార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవలే మేకర్స్ ఈ సినిమాను సెప్టెంబర్ 23న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో మేకర్స్ వరుసగా అప్‌డేట్‌లను ప్రకటిస్తూ సినిమాపై ఆసక్తిని క్రియేట్ చేస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ చిత్రంలోని వర్షంలో వెన్నెల్లా పాట మేకింగ్ వీడియోను విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన వర్షంలో వెన్నెల్లా లిరికల్ సాంగ్‌కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. కాగా తాజాగా మేకర్స ఈ పాట మేకింగ్ వీడియోను విడుదల చేశారు. ఈ పాట కోసం చిత్రబృందం పడిన కష్టం మేకింగ్ వీడియోలో కనిపిస్తుంది. అలాంటి వాతావరణంలో సాంగ్‌ను షూట్ చేశారంటే.. సినిమాపై వాళ్ళకి ఎంత ప్రేముందో ఈ వీడియో చూస్తే తెలుస్తుంది. షిర్లే సేథియా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతాన్ని అందించాడు. ఐరా క్రియేషన్స్ బ్యానర్‌పై ఉషా ముల్పూరి ఈ చిత్రాన్ని నిర్మించారు.



## తదుపరి చిత్రంపై శర్వానంద్ దృష్టి

శర్వానంద్ విభిన్న కథలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో హీరోగా వైవిధ్యతను చాటుకుంటున్నాడు. ప్రస్తుతం ఆయన నటించిన 'ఒకే ఒక జీవితం' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రం శర్వాకు 30వ సినిమాగా తెరకెక్కింది. కాగా శర్వానంద్ ఇప్పుడు తన 31వ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తున్నాడు. శర్వానంద్ తన తదుపరి మూవీని 'ఛల్ మోహన్‌రంగ' ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వంలో చేస్తున్నాడు. ఇప్పటికే అనౌన్స్‌మెంట్ వచ్చిన ఈ చిత్రం వచ్చే వారం సెట్స్ మీదకు వెళ్ళనుందట. ఈ మూవీ లాంఛింగ్ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరుగనుందట. రూరల్ బ్యాక్ డ్రాప్ నేపథ్యంలో ఫుల్ రానెస్‌తో ఈ సినిమా తెరకెక్కనుందట. ఈ చిత్రంలో శర్వా ఇప్పటివరకు చూడని డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నాడట. అంతేకాకుండా శర్వా ఈ మూవీలో డీ గ్లామర్ పాత్ర పోషించనున్నట్లు టాక్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో శర్వాకు జోడీగా రాశీఖన్నా హీరోయిన్‌గా నటించనుంది. ప్రస్తుతం శర్వా నటించిన ద్విభాషా చిత్రం 'ఒకే ఒక జీవితం' సెప్టెంబర్ 9న విడుదల కానుంది. రీసెంట్‌గా విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. టైం ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో అక్కినేని అమల కీలకపాత్ర పోషించింది. శర్వాకు జోడీగా రీతూవర్మ హీరోయిన్‌గా నటించింది. శతమానం భవతి తర్వాత వచ్చిన పడి పడి లేచె మనసు, శ్రీకారం, జాను, రణరంగం, మహా సముద్రం, ఆడవాళ్ళు మీకు జోహార్లు వరుసగా ఫ్లాపయ్యాయి. ప్రస్తుతం శర్వా చేస్తున్న సినిమా ఒకే ఒక జీవితం. ఇది శర్వా కెరీర్‌లో చేస్తున్న 30వ సినిమా కావడం విశేషం. తాజాగా ఈ సినిమా నుంచి థియేట్రికల్ ట్రైలర్ తెలుగు – తమిళ భాషలలో రిలీజైంది. యువ సంగీతకారుడిగా శర్వానంద్ కనిపించబోతున్నాడు. ఇందులో అక్కినేని అమల కీలక పాత్రలో, రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు.నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ ఇందులోలో డైలాగ్స్ రాశారు. సెప్టెంబర్ 9వ తేదీన తెలుగుతో పాటు తమిళంలో కణం పేరుతో రిలీజ్ కాబోతోంది. సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాతో శర్వా ఎలాంటి హిట్ అందుకుంటాడో చూడాలి. ఈ మూవీ గనక హిట్ అయితే మళ్ళీ ఫాంలోకి వచ్చి అవకాశాలు అందుకుంటాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in